పైకి చదివింది.

"అయ్యో.... యిది మన అమ్మాయిదండీ!" అని వెర్రికేక వేసింది.

"ఏమిటీ?" పుల్లయ్య పిచ్చిగా చూశాడు.

"యిది మన సామ్రాజ్యానిది. అది మనసు పడిపోయిందని మీకు చెప్పకుండా కొన్నాను. యిది పెట్టుకుని యివాళ సినిమాకెళ్ళింది. అన్నట్లు పిల్ల యింకా రాలేదేం? బాబోయ్! నా బిడ్డ ఏమైంది? నా తల్లి ఏమైంది? భీముడిని సినిమా హాలుకి పంపానే" అంటూ ఏడుస్తోంది భాగ్యలక్ష్మి. పుల్లయ్య వళ్ళంతా చెమట పట్టేసింది. తలుపు తెరుచుకుని కిందకి వచ్చాడు.

సామ్రాజ్యం కోసం వెళ్ళిన భీముడు- "అమ్మాయిగారు సినిమా హాలు దగ్గర కనిపించలేదండీ!" అంటూ వచ్చాడు.

"ఏమైనట్లు? దాని స్నేహితులెవరూ కనిపించలేదా?"

"కనిపించారండి! ఆట సగంలో వుండగానే తల నొప్పిగా వుంది. యింటికెడతానని బైటకి ఒచ్చేసిందంట."

"ఒక్కర్తేనా?"

"ఔనండి!"

"అయ్యో! యేదో కొంప మునిగింది." భాగ్యలక్ష్మి గుండెలు బాదుకుంది. పుల్లయ్యా, భీముడూ వెతకటానికి వెళ్ళారు. సామ్రాజ్యం యెక్కడా కన్పించలేదు. తిరిగి వచ్చారు. "అయ్యో! పోలీస్ రిపోర్టన్నా యివ్వండి! నా బిడ్డని వెతికి నా కివ్వండి!" ఏడుస్తోంది భాగ్యలక్ష్మి.

పుల్లయ్య ఫోను దగ్గరకి నడిచాడు. ఫోను తీయబోయి ఆగిపోయాడు.

"వద్దు. పోలీసులకి రిపోర్ట్ వద్దు. నేనే మళ్ళీ వెళ్ళి వెతుక్కొస్తాను."

"ఆ గొలుసు మీ దగ్గరకి తెచ్చినవాడిని పట్టుకుని అడగండి!"

"చూశాను. ఆ వెధవ దొరకలేదు."

"మరెలాగండీ! గొలుసుపోతే పోనీ. వయస్సులో వున్న ఆడపిల్లండీ! అసలే కాలం బాగా లేదండీ. రౌడీ వెధవలకి దయా దాక్షిణ్యం వుండదండీ!"

"భాగ్యం! నాకవన్నీ తెల్సు. భీముడూ రా పోదాం." అని పుల్లయ్య బయలుదేరాడు.

పుల్లయ్య ప్రహరీ గేటు దాటబోతుండగా పోలీస్ వాను వచ్చి ఆగింది. పుల్లయ్య కాళ్ళు వణికాయి.

